

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# పౌష్టికాహారం అవసరం: కిషోర్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని సెయింట్‌పాల్స్ స్కూల్ డైరక్టర్ డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో శనివారం కామన్‌బ్రేక్‌ఫాస్ట్ 'ఇడ్లీ' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో అల్పాహారంగా ఇడ్లీ తినిపించారు. స్కూల్ డైరక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమపిల్లల ఆరోగ్యంపై శ్రద్ధవహించి పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్కూల్ డైరక్టర్లు విజయ్‌కుమార్, లక్ష్మినారాయణ, వరప్రసాద్, శ్రావణ్‌కుమార్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

-ఆ పాఠశాలను సీజ్ చేసిన వైనం..డిఇఓ వెల్లడి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ మండలం న్యూభరత్‌నగర్‌లోని సాగర్ గ్రామర్ ఉన్నత పాఠశాల భవనంపై నుంచి దూకి ఓవిద్యార్థి ఆత్మహత్య చేసుకోవటంతో విద్యాధికారులు స్పందించి విచారణ జరిపి ఆపాఠశాలను సీజ్‌చేశారు. శనివారం ఈవిషయాన్ని డిఇఓ వెల్లడించారు. శనివారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పాఠశాలను సీజ్‌చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాపరిధిలోని ఉప్పల్ మండలంలోని న్యూభరత్‌నగర్‌లోని సాగర్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.సంగారెడ్డి ఆపాఠశాల భవనం పైనుంచి ఈ నెల 22న శనివారం కిందికిదూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈవిషయంపై మండల విద్యా అధికారిద్వారా పాఠశాలలో విచారణజరిపినట్లు, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఘటనపై విచారణ జరిపించి, పాఠశాలను సీజ్‌చేసినట్లు డిఇఓ విజయకుమారి పేర్కొన్నారు.

# కంకల్‌లో మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయండి

-ఎంపి విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని అందించిన బిజెపి నాయకులు



ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న జిల్లా బిజెపి నాయకులు రవీందర్, కంకల్ గ్రామస్థులు తదితరులు

**పూడూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

వికారాబాద్‌జిల్లా పూడూరుమండలం కంకల్‌గ్రామంలోని శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో కళ్యాణి చాళుక్యుల సమయంలో వ్రాసిన శాసనాలు, విగ్రహాల భద్రతకోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి గ్రామంలో మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని శనివారం జిల్లా బిజెపి అధికార ప్రతినిధి రవీందర్ చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డికి విజ్ఞపిచేశారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని ఎంపి అధికారిక కార్యాలయంలో కొండా విశ్వేశ్వరరెడ్డికి గ్రామస్థులతో కలిసి వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ, ఆలయం ఆవరణతో మ్యూజియం ఏర్పాటుకు కృషిచేయాలనికోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గ్రామంలోని అత్యంత పురాతనమైన శ్రీవీరభద్రస్వామి దేవాలయం ఉందని, ఇక్కడ సుమారు 60విగ్రహాలు ఉండగా, 15రోజుల కింద పురావస్తుశాఖ పరిశోధకులు ప్లిచ్ ఇండియా ఫౌండేషన్ సిఇఓ శివనాగిరెడ్డి, హరగోపాల్‌ల ఆధ్వర్యంలో పరిశోధనలు చేపట్టి దేవాలయంతో పాటు విగ్రహాలు క్రీ.శ1129,1130,1132 కాలం నాటివిగా గుర్తించినట్లు వివరించారు. ఈపురాతన సంపదను భద్రతకోసం గ్రామంలో మ్యూజియం ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్ని క్రిష్ణ, పిహెచ్‌డి స్కాలర్ సంపత్‌కుమార్, బిజెపి నాయకులు రాజు, గ్రామస్థులు అనంతయ్య, రాంచెంద్రయ్య, ప్రవీణ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వ చీఫ్ విప్‌కి ఆహ్వానం



బ్రహ్మోత్సవాలకు రావాలని ప్రభుత్వ చీఫ్ విప్‌కి అందజేస్తున్న ఆలయచైర్మన్ నారాయణశర్మ

**కీసర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, మేడ్చల్‌జిల్లా ఇంఛార్జి పట్నం మహేందర్‌రెడ్డికి శనివారం ఆహ్వానపత్రికను అందజేశారు. కీసరగుట్ట ఆలయచైర్మన్ తటాకం నారాయణ శర్మసహా ఆలయ ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. కీసరగుట్టలో కొలువుదీరిన శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీనుండి మార్చి 1వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ మహాశివరాత్రి రోజు హాజరుకావాల్సిందిగా ఆలయచైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డిలు ఆహ్వానించారు. అలాగే 25వ తేదీరాత్రి 10గంటలకు నిర్వహించే స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు. భక్తులకు ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లుచేయాలని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు జూపల్లి సాయిలు,మొరుగు ముత్యాలు,నల్ల మధుసూధన్‌రెడ్డి,రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్, కందాడిరాజిరెడ్డి, పోచబోయినరాజు, శ్యామలఅమరేందర్, దుండిగల్ల దుర్గాప్రసాద్‌గౌడ్, నల్లోల్ల కుమార్,సగ్గు అనిత,రాపోలు శంకరయ్య,పాముకుంట ప్రభాకర్‌గౌడ్,క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



ఎన్నారం పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

**కోటపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

మండలంలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలను అసిస్టెంట్‌కలెక్టర్ ఉమాహారతి శనివారం సందర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మండలంలో ఎన్నారం ప్రాథమికపాఠశాల ఎంపికకావడం జరిగింది. ఇందులోభాగంగా అసిస్టెంట్‌కలెక్టర్ సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ విద్యార్థుల సామర్థ్యాలను, బుక్‌రీడింగ్ చేయించారు. ఈసందర్భంగా పాఠశాలకు 5కంప్యూటర్లు మంజూరుచేశారు. తదనంతరం అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, సిఆర్పి నర్సింలు, లావణ్య, మహేశ్వరి, హర్షియా, కోటపల్లి ఎంపిఓ, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్



తూంకుంట పర్యటనలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, తదితరులు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

శామీర్‌పేట గ్రామంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం శామీర్‌పేట గ్రామంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా వివిధవార్డుల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్యం, నీటిసరఫరా, రోడ్ల పరిశుభ్రతలను పరిశీలించారు. పలువురు అధికారులు, స్థానికనాయకులతోకలిసి ఆయన శామీంపేటలో మార్నింగ్‌వాక్ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్నవేసవితో ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వివిధవార్డుల్లో అందుబాటులో ఉన్న పవర్‌బోర్లను వాటి పనితీరును పరిశీలించి అవసరమైతే మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ సునీత, పలువురు శానిటేషన్ అధికారులు, సిబ్బంది, గ్రామ మాజీ సర్పంచ్ బి.కిషోర్‌యాదవ్, గ్రామనాయకులు ఎం.మహేందర్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, పలువురునాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక సేవారంగాల్లో మహిళాసంఘాల పాత్ర కీలకం

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

సామాజిక సేవారంగాల్లో మహిళాసంఘాల పాత్ర ఎంతో కీలకమని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వయంసహాయకసంఘాల బలోపేతానికై సిఆర్‌పిల వ్యూహంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. వికారాబాద్‌జిల్లాలోని దోమ, వికారాబాద్,ధారుర్, మర్పల్లి, మోమినిపేట్‌మండలాల్లో పలుజిల్లాలకు సంబంధించిన సిఆర్‌పిలు రెండువారాల పాటు వివిధ గ్రామాల్లో సందర్శించి స్వయం సహాయక సంఘాల బలోపేతానికై శిక్షణలు నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ, నిరుపేదల నిర్మూలనే సెర్ప్ ప్రధాన ఉద్దేశమని, స్వయంసహాయకసంఘాలు తమకుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకుంటూనే సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. సమాజంలో బాల్యవివాహాలు,విద్య,ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యతకూడా అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. మహిళాసంఘాలు పొదుపుచేయడమేకాకుండా, బ్యాంకులనుండి పొందిన రుణాలను సకాలంలో చెల్లించేవిధంగా చర్యలుతీసుకోవాలని సూచించారు. మహిళాసంఘాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామాల్లో సంఘాలను నెలకొల్పడమే కాకుండా సమావేశాలు నిర్వహించి మూతపడిన సంఘాలు పునరుద్ధరించే విధంగా అధికారులు, సంఘాలనాయకులు కృషిచేయాలని కలెక్టర్ తెలిపారు.మహిళలు ఆత్మబలాన్ని పెంపొందించుకొని అవసరమైనరంగాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిచెందాలని ఆయన సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకొని పొదుపు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు, బ్యాంకులకు చెల్లించిన అప్పులవివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ పుస్తక నిర్వహణను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రుణాలు పొందిన మహిళా సంఘాలు సకాలంలో రుణాలచెల్లింపుల్లో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకొని



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లేలా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. సమీక్షాసమావేశం సందర్భంగా వివిధజిల్లాలనుండి ప్రాతినిధ్యం వహించి గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి సంబంధించి సూచించిన విషయాలను కలెక్టర్‌కు తమ నివేదికల ద్వారా సిఆర్‌పిలు వివరించారు. ఈసమీక్షాసమావేశంలో డిఆర్డిఓ శ్రీనివాస్, అదనపు డిఆర్డిఓ సరోజ, మహిళాసమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలవేలు, డిపిఎం వీరయ్య, గ్రామ మహిళాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి దాడులు చేస్తున్నా ప్రభుత్వశాఖల్లో తగ్గని అవినీతి!




ఏసిబి హెడ్‌క్వార్టర్స్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

అవినీతిపరుల పాలిట ఏసిబి సింహస్వప్నంలా మారింది. అయినా లంచాలకు రుచిమరిగిన అవినీతి అధికారులు, సిబ్బందితీరు మారడం లేదు. కానీ ఏసిబి వలలో చిక్కుకున్న తర్వాత సంబంధిత ప్రభుత్వ ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈవాస్తవం తెలిసినా ఇంకా అనేక ప్రభుత్వ శాఖల్లో అవినీతి కంపు కొడుతూనే ఉంది. ఏసిబి దాడుల సంఘటనలు ఇటీవల జిల్లాలో ఎక్కువగా చోటు చేసుకున్నాయి. రెవెన్యూ, పోలీసు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతిపై యువకులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలో జరిగిన పలు సంఘటనల్లో యువకులే ఈ తిమింగలాలను పట్టించారు. గతంలో రెండు, మూడేండ్లకు ఓ ఏసిబిదాడుల సంఘటన జరిగి పెద్ద చర్చనీయాంశంగా మారేది. ప్రస్తుతం ఏడాదికి నాలుగైదు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు ఏసిబి భయం ఉంటున్నా లంచాలను మాత్రం మరువడం లేదు. నెలనెలా వచ్చే ప్రభుత్వ జీతం కంటే పదిరెట్లు ఎక్కువగా లంచాల రూపేణా అందుకుంటున్న అవినీతి అధికారులకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని అనుకుంటున్నారు. ఇటీవల ఎక్కువగా అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వశాఖల్లో గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో ఏసిబిఅధికారులు ఈశాఖలపైనిఘాపెడితే పెద్దచేపలు గాలంలో పడతాయని అంటున్నారు. అయితే, ఫిర్యాదులు అందితేనే ఏసిబి అధికారులు ఎక్కువగా రైడ్స్ చేస్తున్నారు. తమను లంచాలపేరిట వేధింపులకు గురిచేస్తేనే బాధితులు సంబంధిత అధికారులపై ఫిర్యాదులు చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధి విభాగంలో చాలాకాలంగా జాతీయ ఉపాధిహామీ పథకం కింద చాలాచోట్ల పనులు లేకుండా బిల్లులు స్వాహా చేశారనే ఆరోపణలు వచ్చాయి. పాత పనులనే కొత్తగా చేపట్టినట్లు రికార్డులు సృష్టించి దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం. వీటిపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో కిందిస్థాయి నుంచి వాటాలు ఇవ్వాలని రేటు ఫిక్స్‌చేశారు. పర్సెంటేజీ ఇవ్వకుంటే ఎంబి రికార్డులు చేయడం లేదు. ఈతతంగం దశాబ్ధాలుగా సాగుతున్న విషయం జగమెరిగిన సత్యం. ఆర్‌అండ్‌బి, నీటిపారుదలశాఖల్లోనూ ఇదేపరిస్థితి. ఈమధ్యకాలంలో మున్సిపాలిటీల్లో దుబారా ఖర్చులు ఎక్కువైనట్లు తెలిసింది.

# మా సర్వే బలహీనవర్గాల భావోద్వేగం

-కులగణన సర్వేపై బిజెపి, బిఆర్‌ఎస్ కుట్రలు

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

తెలంగాణలో సాహసోపేతమైన కులగణన సర్వే బలహీనవర్గాల భావోద్వేగం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసి నేతలకు సూచించారని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానికమీడియాకు తెలిపారు. శనివారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన బిసిసంఘాల నాయకుల సమావేశానికి ఎమ్మెల్యే శంకర్,కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్‌లు హాజరయ్యారు.అనంతరం ఎమ్మెల్యే శంకర్ స్థానికమీడియాతో మాట్లాడారు. బిసి కులగణనను అన్నివర్గాలు నియోజకవర్గ వ్యాప్తంగా బలపరచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సూచించారని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే ఈసమావేశాలకు అందరూ కలిసి రావాలన్నారు. మిగిలిన విషయాల్లో విభేదించినా ఇబ్బంది లేదు. కానీ కులగణన విషయంలో మాత్రం రాజకీయాలకు అతీతంగా సహకరించాలని తెలిపారు. సర్వేలో పాల్గొననివాళ్ల ఇంటిముందు డప్పు కొట్టండి. బలహీనవర్గాల నేతలు కులాలవారీగా సమావేశాలు పెట్టమని సిఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. బిసిల కోసం చేపట్టిన సర్వే ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో తాను కూడా ఒక సభ్యుడిగా ఉన్నందున తనకు గర్వంగా ఉందని తెలిపారు. తమప్రభుత్వం తల ఎత్తుకొనితిరిగే పనిచేశామన్నారు. మార్చి10 లోపు అన్నిసంఘాలతో సమావేశాలు నిర్వహించి అందరికీ తెలపాలని, ఈలెక్కలు కాదు.. కూడదు అంటే జీవితంలో మళ్లీ అవకాశంరాదని ముఖ్యమంత్రి స్వయంగా తెలిపారన్నారు. ఈనివేదికను బలపరిస్తే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఎవరి కులం వారు ఆసంఘాల సమావేశం నిర్వహించాలని



సమావేశంలో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సిఎం పార్టీనేతలకు సూచించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశంలో తనకు రజకసంఘం సమావేశం గురించి నేరుగా ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కెసిఆర్ సర్వే ఎంతగొప్పగా ఉందో ఎస్సీ,ఎస్టీ ఉపకులాల లెక్క చూస్తే అర్థమవుతుందని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. సమగ్ర సర్వేలో ఎస్సీలలో 82 కులాలు అని చెప్పారని, ఎస్సీ,ఎస్టీ,ఉపకులాల సంఖ్య పెరిగిందని, సమగ్రసర్వే అర్థంపర్థంలేని లెక్కలు, సిగ్గుతో బయటపెట్టలేదని, బిఆర్‌ఎస్, బిజెపి కోర్టుకు వెళ్లి బిసి కులగణన ఆపాలని చూస్తున్నాయని, అందుకే లెక్క సరిగ్గా ఆధారాలతో సహా చేశామని తెలిపారు. కంప్యూటర్‌లోనే కాదు, సర్వేచేసిన పేపర్‌బండిల్ కూడా సిద్ధంగా ప్రభుత్వం ఉంచిందని చరిత్రలో కులగణన సర్వే నిలిచిపోతుందన్నారు.

# సిసిఐ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సిసిఐ కార్మికులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

సిసిఐ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తాండూర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సిసిఐ కాంట్రాక్టర్ ఎంప్లాయ్ యూనియన్ ప్రధానకార్యదర్శి టి.శరణప్పలు మాట్లాడుతూ, సిసిఐ కార్మిక సమస్యలపైన తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో సిసిఐ కార్మికులసమస్యలు పరిష్కరించాలని తాండూర్ ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటుచేయాలని మిగతా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కంపెనీ చట్టాలు యాజమాన్యం బాధ్యతపైన కంపెనీ కోడ్ ఆఫ్ కాండక్ట్ కింద యాజమాన్యం కార్మికసంఘ నాయకులతో చర్చజర్పించి కార్మికుల సమస్యలపైన స్పందించాలని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్మికులపైన, కార్మిక నాయకుల పైన సిసిఐ యాజమాన్యం దురుద్దేశంతో రాజకీయాలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. పదోన్నతులు పిఎఫ్‌లో తండ్రిపేరు లేని సమస్య పెన్షన్‌సమస్యలు భర్తనుపోగొట్టుకున్న మహిళల సమస్యలు వంటి సమస్యలపట్ల సిసిఐ యాజమాన్యం చిత్తశుద్ధితో లేకపోతే ఒక వారంరోజుల లోపల కార్మికుల సమస్యలపైన స్పందించకుంటే, పరిస్థితి తీవ్రతరంగా ఉంటుందని హెచ్చరించారు.రాజకీయాలకతీతంగా కార్మికులకు కార్మికచట్టాలు తెలవకుండా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. సిసిఐ యాజమాన్యం వైట్‌పేపర్ మీద గ్రాజువిటీ ఇపిస్తాము అని చెప్పి కొంతమంది కార్మికులతో తెల్లపేపర్ మీద సంతకాలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇది సరైనది కాదని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, నాగిరెడ్డి, జగదీష్, రామ్‌రెడ్డి, రాము, ఈరమ్మ, లలిత పాల్గొన్నారు.

# అనంతపద్మనాభస్వామి ఆలయ పునర్నిర్మాణం



మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న నాయకులు

**కొత్తూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

కొత్తూర్‌మండలంలోని పెంజర్లగ్రామంలో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని పునర్మించామని ఆలయకమిటీ చైర్మన్ బెజవాడ అనితరెడ్డి అన్నారు. ఈపునర్మాణ పనులు భక్తుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీసభ్యులు తెలిపారు. సోమవారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవేడుకకు హాజరుకావాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుదర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్‌గౌడ్ కలిసి ఆహ్వానించారు.

# బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం



ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని ఆహ్వానించిన ధర్మకర్తలు, తదితరులు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

బొమ్మరాసిపేట్‌గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ఆలయ ధర్మకర్తలు, నాయకులు మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. శనివారం శామీర్‌పేటమండలం బొమ్మరాసిపేట్‌నుంచి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి నివాసానికి వెళ్లి ఈనెల 26వతేదీన మహాశివరాత్రి సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఆహ్వానపత్రాన్ని అందజేశారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆహ్వానించినవారిలో దేవస్థానం ధర్మకర్తలు శ్రీనివాస రామరాజు, శ్రీహర్షరామరాజు, మండల బిఆర్‌ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కులగణన సర్వేను ప్రతి ఒక్కరూ చేసుకోవాలి



సర్వేలో పాల్గొన్న బిసి కమిషన్ మెంబర్ బాలలక్ష్మి

**కీసర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను ప్రతి ఒక్కరూ చేసుకోవాలని రాష్ట్ర బిసికమిషన్ మెంబర్ బాలలక్ష్మి కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసంవర్భంగా ఆమె మాట్లాడుతూ మిగిలిపోయిన కుటుంబాల వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించినందుకు ఈ అవకాశాన్ని ప్రతికుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలోనే మొట్టమొదట తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టిందని ఇంకా కొన్ని కుటుంబాలు సర్వేలో మిగిలిపోయిన బిసి కమిషన్ తరఫున అన్ని రాజకీయపార్టీలు అన్ని కులసంఘాలు పాల్గొని సర్వే పూర్తి చేయటానికి పర్యటిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటరెడ్డినగర్ కాలనీలో సర్వేలో వివరాలు ఇవ్వటానికి నిరాకరించిన కుటుంబం ఇంటికి వెళ్లి సర్వేపై వారికి ఉన్న అనుమానాలు వివరించి వారినుండి సర్వే వివరాలు తీసుకోవటం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, మాజీ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుర్వి శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్‌తో మరోసారి దోపిడీ..

**-బిజెపి కొత్తూర్ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి**

**కొత్తూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ప్రజలు అభయహస్తం అని కాంగ్రెస్‌పార్టీకి ఓట్లువేసి గెలిపిస్తే ఇప్పుడు అదే కాంగ్రెస్‌పార్టీ జనాలపాలిట భస్మాసురహస్తంగా తయారైందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) నిర్ణయాన్ని వెంటనే వెనక్కితీసుకోకపోతే తీవ్రపరిణామాలు తప్పవని బిజెపి కొత్తూర్ మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. గతంలో ప్రజలజేబులను ఖాళీచేయడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ ఇప్పుడు దానిని కొనసాగించడం దారుణమన్నారు. ప్రజలను మోసంచేయడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు పోటీపడుతున్నాయన్నారు. ప్రజలను దోచుకునేదానిపై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమంపై పెట్టాలని, ప్రజలు మిమ్మల్ని పక్కనపెట్టేరోజు ఎంతోదూరంలో లేదన్నారు. ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడానికి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు.

## విద్యార్థులకు ఒత్తిడిలేని చదువులు అవసరం

**-వైస్‌చాన్స్‌లర్ వెలుదండ నిత్యానందరావు**



సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించిన పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ వెలుదండ నిత్యానందరావు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

విద్యార్థులు ఒత్తిడి లేని చదువులు చదవటం అవసరమని, సమాజం పట్ల బాధ్యత, మంచి అలవాట్లు, వృధాఖర్చులు తగ్గించుకొనటం, తల్లిదండ్రుల నుంచి నేర్చుకోవటం అవసరమని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు అన్నారు. శనివారం శామీర్‌పేట మండలంలోని మురహరిపల్లిలోని సినర్జి విద్యాసంస్థలో సమిష్టి సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. దీనిలో ఆయనతో పాటు సినీ డైరక్టర్ ఎన్‌ఆర్‌కె రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగ జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిత్యానందరావు మాట్లాడుతూ సాంకేతికంగ ఎంత అభివృద్ది చెందినా మానవవిలువలు, మనుగడ మొదటిప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు తమవంతు కర్తవ్యాలను గురుతర బాధ్యతలను నెరవేర్చాలన్నారు. సినీడైరక్టర్ ఎన్‌ఆర్‌కెరెడ్డి మాట్లాడుతూ దేశప్రగతిలో యువతపాత్ర కీలకమన్నారు. కులమతాలకు అతీతంగ తమప్రగతి ఉండాలని సూచించారు. భాషపట్ల మమకారం, తల్లిదండ్రులు, గురువులపై ప్రేమానురాగాలు ఉండాలని, విద్యార్థులలో, యువతలో ఓర్పు లేకపోవటంవల్ల మానవవిలువలు అంతరించిపోతున్నాయని, ప్రతి ఒక్కరికి సహనం ఓర్పు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాటల పోటీలు, నృత్యప్రదర్శనలు, క్విజ్‌పోటీలు, వంటలపోటీలు, పలురకాలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గజ్వేల్, మేడ్చల్ పలుప్రాంతాలనుంచి జంటనగరాలనుంచి సుమారు వందకళాశాలల నుంచి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. గిన్నీస్ బుక్‌లో నమోదుచేసుకున్న ప్రముఖ నాట్యకారిణి లిజిత నాట్య ప్రదర్శనలో జడ్జిగా వ్యవహరించారు. గాయకులు తిరుపతిరెడ్డి, గోపినాథ్, కార్యక్రమ కార్యదర్శి కల్యాణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

**మనూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండలంలో ఓటు హక్కును పొందిన పట్టభద్రులు 419 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు హక్కును 16 మంది పొంది ఉన్నారన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును సద్వినియోగం చేసువాలని పట్టభద్రులను, ఉపాధ్యాయులకు తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్ఓ శంకర్‌రెడ్డి, ఖాజా మైనుద్దీన్ సూచించారు.

## నేడు గురుకుల ప్రవేశానికి పరీక్షలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈ నెల 23న సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశించేందుకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చారిలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం 251905లో పరీక్షలు రాయబోరే విద్యార్థులు నారాయణఖేడ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఉదయం 9 గంటల వరకు హాల్ టికెట్, గుర్తింపు కార్డు (ఆధార్‌కార్డు), బాల్‌పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్‌లతో సమయానికి హాజరు కావాలని సూచించారు.

### ఘనంగా షైన్ స్కూల్ వార్షికోత్సవం

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని లక్ష్మిగార్డెన్స్‌లో షైన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆదర్శ్‌రెడ్డి తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాద్, నాయకులు పరమేష్ యాదవ్, మైనార్టీ నాయకులు అజీముద్దీన్, గౌస్, గఫూర్, ఖదీర్, కుతుబుద్దీన్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

### బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో మరమ్మత్తు పనులు చివరి దశలో ఉన్నాయని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం బైపాస్ రోడ్డులోకొనసాగుతున్న మరమ్మతు పనులను దారం శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడుతూ బైపాస్‌రోడ్డు పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యల తగ్గుతుందన్నారు. ఉదయం సమయాల్లో ప్రజలు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, గృహిణులు, యువకులకు వాకింగ్ చేసేందుకు అనువాగా ఉందన్నారు. పట్టణంలోని ఏ కాలనీలో సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** మండల పరిధి మిర్జాపల్లికి చెందిన సురేష్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న లిలా గ్రూప్ చైర్మన్ డా,,మోహన్ నాయక్ శనివారం నాడు బాధిత కుటుంబానికి రూ.5వేల రుపాయల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోయిని అరుణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బిల్లులు అందచేయాలని ఎంపిడిఓకు వినతి

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాక అవస్థలుపడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ చంద్రశేఖర్‌కు శనివారం పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా గ్రామాల్లో ప్రత్యేక పాలన సాగుతోందని, సకాలంలో బిల్లులు రాక పడరాని పాట్లు పడుతున్నామని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిత్యం నిర్వహించే కార్యక్రమాలైన చెత్త సేకరణకు ట్రాక్టరకు డీజిల్, శానిటేషన్, బోర్ల మరమ్మతులు తదితర పనులకు జీతం నుంచే చెల్లించాల్సి వస్తోందని, తమ ఇండ్లలో కుటుంబ సభ్యులు అర్థాకలితో అలమించాల్సి దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 13 నెలలుగా నిధులు రావడం లేదని, అధికారులు, పాలకులు స్పందించి బిల్లులు అందించి ఆదుకోవాలని పంచాయితీ కార్యదర్శులు వినతి చేస్తున్నారు.

# మీరు ఎవరినీ లెక్కచేయని మొనగాళ్లా..?

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య ఆగ్రహం**



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మీరు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కూడా లెక్కచేయరు అడ్డగోలుగా మీకు ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ రోడ్లు, నీటి వనరుల స్థలాలను కబ్జా చేసి శాశ్వత కట్టడాలు కడతారు.. మీరు ప్రభుత్వాన్ని పెద్దలను ఎవరినీ లెక్కచేయని మొనగాళ్లా..? అంటూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ శివారులో కానుగుల కుంట (వీరమోనిచెరువు) నీరుపారే ప్రదేశంచుట్టూ ప్రహరీ గోడనిర్మించిన నరసింహ్మామూర్తి అనేవ్యక్తి ఆగడాలపై మరోసారి దుమారంరేగింది. నరసింహ్మామూర్తి భూమికి సంబంధించిన ప్రధాన ద్వారం వద్ద నీళ్లు వెళ్లకుండా సిమెంటు స్లాబ్ వేసి అక్రమంగా రాత్రికి రాత్రే ఆర్‌అండ్‌బీ స్థలంలో కల్వర్టు నిర్మించడం పట్ల మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలునాయక్, దిలీప్ తదితరులు నరసింహ్మామూర్తివద్ద పనిచేస్తున్న మేనేజర్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నో సందర్భాల్లో ఈ అక్రమనిర్మాణాలపై ప్రభుత్వానికి, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులకుకూడా ఫిర్యాదు చేసినట్లు బీష్వ కిష్టయ్య తెలిపారు. కానుగులకుంట పారేనీటిని దారిమళ్లించి చుట్టూ ప్రహరీ గోడ కట్టుకోవడం, ఇటీవలే ఈ అంశం వివాదాస్పదంగా మారడం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తనతో సహ అందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం జరిగిందన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ సంఘటనాస్థలానికి చేరుకొని అక్రమంగా నిర్మించిన స్లాబును పరిశీలించినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. ఇలాగే చేస్తే గ్రామప్రజలు చూస్తూ ఊరుకోరని, తగిన గుణపాఠం చెబుతారని కిష్టయ్య హెచ్చరించారు. రైతులకు అన్యాయంజరిగితే చూస్తూ ఊరుకోమని, ఇప్పటికే రెండుపంటలు నష్టపోయామని పేర్కొన్నారు. అధికారులుకూడా తమవిధులు సక్రమంగా నిర్వహించకుండా నరసింహ్మామూర్తితో కుమ్మక్కయ్యారని కిష్టయ్య ఆరోపించారు.

**ఇదేం పద్ధతి?**

**మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆగ్రహం..**

ఆర్‌అండ్‌బీ స్థలంలో రాత్రికిరాత్రి సిమెంట్ స్లాబ్ వేయడం ఏంపద్ధతని, అసలు సహజ నీటివనరుల చుట్టూ ప్రహరీగోడ నిర్మించడమే పెద్దనేరమని, పైగా నీరుప్రవహించకుండా అడ్డంగా నీటి ప్రవాహానికి సిమెంటుస్లాబ్ వేయడం సరికాదని, ఈ కల్వర్టును వెంటనేతొలగించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అధికారులను కోరారు. కానుగులకుంటవద్ద అక్రమంగా నిర్మించిన కల్వర్టును వెంటనే తొలగించాలని స్థానిక ఏఈ రాజశేఖర్‌కు తెలుపగా, మరో ఉన్నతాధికారి లైన్‌లోకివచ్చి శ్రీకాంత్‌రెడ్డికి ఏదో సర్దిచెప్పబోయారు. అయితే శ్రీకాంత్‌రెడ్డి ససేమిరా వినకుండా దానిని తొలగించాలని పట్టుబట్టారు. ఇంతదౌర్జన్యం, ఇంత అన్యాయం చేయడం సరికాదని ఇదేంపద్ధతని శ్రీకాంత్‌రెడ్డి వాపోయారు. చెరువు పక్కన ఉన్న తమపంటలు మునిగిపోతున్నాయని, నీరు సరిగ్గా ప్రవహించకుండా అడ్డుకోవడంతో రైతులకు నష్టం జరుగుతుందని శ్రీకాంత్‌రెడ్డిఆవేదన వ్యక్తంచేశారు. నరసింహ్మామూర్తి ఆగడాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.

## వాస్తవాలు తెలుసుకోకుండా సవాలు ఎందుకు

**-టిడిపి సీనియర్ నాయకుడు నాగులపల్లి అనంతయ్య**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడతారని, అనవసరంగా మీడియాలో చలామణి అయ్యేందుకు అవాస్తవాలు మాట్లాడుతూ రాజకీయపరిజ్ఞానం లేకుండా బిఆర్ఎస్ నాయకుడు రాజా వరప్రసాద్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని షాద్‌నగర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాగులపల్లి అనంతయ్య మీడియా ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ నాయకుడు రాజా వరప్రసాద్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అవహేళనగా మాట్లాడుతూ ప్రకటన జారీచేయడం గర్హనీయమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో మాట్లాడిన మాటలు, విమర్శలు ఆయా దినపత్రిల్లో ప్రచురించబడ్డాయని, దానిపై మాజీ ఎమ్మెల్యే బక్కని తన అభిప్రాయాన్ని ప్రస్తారించారని, అయితే అవేమీ తెలుసుకోకుండా రాజా వరప్రసాద్ అర్థ రహితంగా మాట్లాడడం అవివేకమని పేర్కొన్నారు. రాజా వరప్రసాద్ నోరు అదుపులో పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదని అనంతయ్య హితవు పలికారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మరో రూపంలో తెలంగాణలో అడుగుపెడుతున్నారని అవమానకరంగా మాట్లాడిన కెసిఆర్ అంశాలను ఆయా దినపత్రికలు ప్రచురించాయని, అలాంటప్పుడు ఆయన మాటలపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మీడియాతో మాట్లాడారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేక రాజా వరప్రసాద్ తన ఇష్టం వచ్చినట్లు అవహేళనగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు గురించి మాట్లాడడం సబబు కాదని తెలిపారు.

## గురుకుల్‌లో మట్టితో రోడ్డు చదును



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ గురుకుల్ జూనియర్ కళాశాలలో శనివారం మట్టి పోసి చదునుచేశారు. వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తిమేరకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యాయాదవ్‌ను మట్టికావాలనికోరగా పోయించి జేసీబీతో చదునుచేయించారు. గురుకుల్‌లో విద్యార్థులకు, వాకర్స్‌కు నడవడానికి రోడ్డు గుంతలుండటంతో ఇబ్బందులు పడుతున్నారని వాకర్స్ అసోసియేషన్స్ అధ్యక్షులు సార శ్రీనివాస్‌గౌడ్ తెలియజేయగా లారీలలో మట్టితెప్పించి పోసి రోడ్డును చదునుచేయించారు. 10వవార్డు మాజీ కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్‌ముదిరాజ్, వాకర్స్‌అసోసియేషన్ అధ్యక్షులు సార చిన్న శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి రాజులు దగ్గరుండి చదును చేయించి పాదచారులకు సౌకర్యంగా చేశారు.

### మహిళల ఆర్థిక అభివృద్ధికి కోల్ ఇండియా చేయూత

**జహీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కోల్ ఇండియా కంపెనీ చేయూత అందిస్తుందని కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సచిన్ అన్నారు. శనివారం వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి సర్వీసెస్ వికాస్ ఆధ్వర్యంలో స్తాపూర్ ఎస్‌వి ఫంక్షన్‌హాల్‌లో కోల్ ఇండియా కంపెనీ ఆర్థిక సహాయంతో మహిళలకు రెండవ విడత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతికి కంపెనీ అందిస్తున్న సహకారంపై వివరించారు. మహిళలకు సొంత నిధులతో కట్టు మిషన్లు అందిస్తూ వారు వారి కాళ్లపై నిలిచేలా జీవనోపాధి అందుకుంటున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వికాససంస్థ ప్రతినిధి, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డును ప్రారంభించిన బిజెపి నాయకులు



మొరంగపల్లిలో సిసి రోడ్డును ప్రారంభిస్తున్న బిజెపి నాయకులు

**వికారాబాద్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోనీ మోమిన్ పెట్ మండలం మోరంగపల్లి గ్రామంలో, భారత ప్రభుత్వ విప్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్డును బిజెపి జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా దిశాకమిటీ మెంబర్ వడ్ల నందు, మోమిన్ పేట్ మండల పార్టీ అధ్యక్షులు భుజంగ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, బూత్ అధ్యక్షులు మహేందర్, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు ప్రొజెక్టర్, ప్రింటర్ల బహూకరణ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు బుద్దాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షురాలు వెనిరబుల్ ఉపేక్ష మాతాజీ ప్రొజెక్టర్, ప్రింటర్లను బహుకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో చాప్టర్ సభ్యులు అరుణకుమారి, నాగయ్య, సుజాత బారువా, సిద్దార బారువా, భాస్కర్ రావు, స్కూల్‌ఆఫ్‌హోప్ ఇంచార్జి సుజాతబారువా సహకారంతో ప్రొజెక్టరు, ప్రింటర్లనుసమకూర్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి జి.మనోహర్, గ్రామస్థులు సిద్దార్థ, లక్ష్మారెడ్డి, బాల్‌రాజు, అనిల్, ఉపాధ్యాయులు మన్నాన్, గౌరీశ్వర్, దేవి ప్రసూన, బ్రహ్మాచారి రాజకుమారి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### కీసరగుట్టలో తైబజార్ వేలంపాట 4లక్షలు



తైబజార్ వేలంపాటలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ నాగమణి

**కీసర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 24వతేదీ నుండి మార్చి 1వతేదీ వరకు శనివారం నిర్వహించిన తైబజార్ వేలంపాటలో క్రిష్ణారావు 4లక్షలు పాడి దక్కించుకున్నారు. రెండవస్థానంలో రావుల సత్యకుమార్ 3లక్షల 65వేలు పాడి రెండవస్థానంలో ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నాగమణి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వటమే ప్రభుత్వలక్ష్యం

**-కేశవరం గ్రామానికి 101 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు**




సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్,పాల్గొన్న డిపిఓ, హౌజింగ్ పిడి, ఎంపిడిఓ, ఎంపిఓ

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే రాష్ట్రప్రభుత్వ నిర్ణయమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ స్పష్టంచేశారు. శనివారం మూడుచింతలపల్లిమండలంలోని కేశవరంగ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుకింద ఎంపికచేసి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వటానికి లబ్దిదారులను ఎంపికచేసి అవగాహనకల్పించటం జరిగింది. కేశవరంగ్రామానికి 101 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయినట్లు తెలిపారు. ఈసందర్భంగ జరిగిన అవగాహన సమావేశంలో మేడ్చల్ ఎఎంసిచైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లునిర్మించి ఇవ్వాలన్నది రాష్ట్రప్రభుత్వ యోచన అని అన్నారు. మేడ్చల్‌నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుకింద ఎంపికచేసి ఈగ్రామానికి 101ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయటం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించాలన్నది సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. పేదలు ఇండ్లు నిర్మించుకుని అప్పులపాలు కాకుండ ఉండటానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసి ఆర్థికంగఆదుకుంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పొందిన వారు వెంటనే అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఇండ్లు నిర్మించుకోవటం ప్రారంభించాలని చైర్మన్ బి.నర్సింలుయాదవ్ సూచించారు. దీనిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణం విషయంలో అధికారులు అవగాహన కల్పించారు. ఈసమావేశంలో జిల్లాపంచాయతీ ఇన్‌చార్జి అధికారి, డిఆర్‌డిఓ సాంబశివరావు, హౌసింగ్ పిడి మూర్తి, డిఈఈ భగవంతరావు, ఎంపిడిఓ గీతారెడ్డి, ఎంపిఓ మంగతాయారు, పంచాయతీ కార్యదర్శి గౌతమి, మాజీ ఎంపిటిసి హనుమంతరెడ్డి, ఇందిరమ్మకమిటీ సభ్యులు ఎండియూసుఫ్, మల్లేశ్‌యాదవ్, రామస్వామి, గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ

**చౌటకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్‌డిఓ పాండు పరిశీలించారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌డిఓ వెంట తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపిడిఓగా ఎంపిఓ హమీద్ హుసేన్

**మనూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఎంపిఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న హమీద్‌హుసేన్‌కు ఇన్‌చార్జి ఎంపిడిఓగా బాధ్యతలు అప్పగిస్తూ శనివారం జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన హమీద్‌హుస్సేన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు.

### ఘనంగా కాశీ విశ్వనాథ ఆలయ వార్షికోత్సవం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండలపరిధిలోని పోతాన్ పల్లి(ఆర్)లో శ్రీకాశీవిశ్వనాథ ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు శని వారం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తనయ, బిఆర్ఎస్ యువ నాయకురాలు మహారెడ్డి శ్రేయరెడ్డి హాజరై ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, టిఆర్ఎస్వీనియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, పార్టీ యువత మండల అధ్యక్షుడు మచ్చేందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శంకర్, ప్రశాంత్ సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, చింటూ నరేష్, ప్రమోద్‌గౌడ్, బూమేష్ పాల్గొన్నారు.

**ఆలయంలో పూజలు నిర్వహించిన చంద్రశేఖర్‌రెడ్డి...**

పోలస్‌పల్లి గ్రామంలోని శివాలయంలో శనివారం నిర్వహించిన ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమాలకు హాజరైన చంద్రశేఖర్‌రెడ్డిని ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, భూమ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, పండరి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులైన విద్యార్థులు

**పుల్‌కల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్స వాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు భోధించి అందరిని ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా అబ్దుల్, ఉపాధ్యాయులుగా శ్రీవర్షిణి, సుచిత్ర, అక్షిత, నందిని, పూజ, స్పందన, స్వాతి, శివలీలా, శ్రీలక్ష్మిలు బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్, ఉమారాణి, మధులత, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దినకర్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. మదూర్ పరిధిలోని 33/11 కేవి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం చెన్నాయపల్లి, వెంకట్‌రావుపల్లి, మదూర్ గ్రామాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విని యోగదారులు, రైతులు సహకరించాలని వారు కోరారు.

## చిన్న కుటుంబం... పెద్ద కష్టం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఓ నిరుపేద కుటుంబానికి అనారోగ్య రూపంలో పెద్ద కష్టం వచ్చి పడింది. ఇంటి యజమాని క్యాన్సర్ బారిన పడటంతో పోషణ కష్టతరమైంది. రోజూ పనిచేయకపోతే పూట గడవని పరిస్థితి. వైద్యం చేయించుకునేందుకు లక్షలాది రూపాయల ఖర్చును భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన మహేశ్వరి, సురేష్ దంపతులు. వారికి కొడుకు పవన్, కుమార్తెలు లావణ్య, వైష్ణవి ఉన్నారు. కొన్ని సంవత్సరాలక్రితం బతుకుతెరువు నిమిత్తం భాగ్యనగరానికి వలస వెళ్లి కూలిపనులు చేసుకుని కుటుంబాన్నిపోషిస్తూ, పిల్లల్ని చదివిస్తున్నారు. కొన్నినెలల క్రితం సురేష్ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా గొంతు క్యాన్సర్ అని వైద్యులు తెలిపారు. ఆరునెలలుగా భాగ్యనగరంలోనే పనిచేసుకుంటూ కుటుంబ పోషణ, వైద్యం చేయించుకున్నాడు. అనారోగ్యం తీవ్రంకావడంతో కూలిపనులకు వెళ్లలేని స్థితికి చేరుకున్నాడు. చేసేది ఏమిలేక సురేష్, భార్య,పిల్లలతో కలిసి స్వగ్రామైన చిన్నశంకరంపేట పట్టణానికివచ్చి అద్దెఇంటిలో ఉంటున్నాడు. ఇప్పుడు పిల్లల్ని స్వగ్రామానికి తీసుకురావడంతో వారి చదువులు సైతం ఆగిపోయాయని దంపతులిద్దరు ఆవేదన వ్యక్తం చేశారు.

### భాగ్యలక్ష్మి ట్రేడర్‌లో ఎరువుల అమ్మకాలు నిలిపివేత

**కౌడిపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోగల భాగ్యలక్ష్మి ట్రేడర్‌లో ఇప్పటినుండి ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు ఎవో స్వప్న జాదేవ్ (స్టాప్ సేల్ ఆర్డర్) ఉత్తర్వులను శనివారం యజమానికి జారీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా భాగ్యలక్ష్మి డీలర్ ప్రభుత్వం ప్రకటించిన ధరల కంటే అదనంగా విక్రయిస్తున్నట్లు తమదృష్టికి రావడంతో మొదటిసారి హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికి, సదర్ యజమాని యాథావిధిగా ఎరువులపై అదనంగా డబ్బులు తీసుకుంటున్నట్లు తనకు ఫిర్యాదులు రావడంతో అమ్మకాలను రద్దుచేసినట్లు తెలిపారు. ఇకనుండి జిల్లా వ్యవసాయ అధికారుల అనుమతులు లేకుండా ఎరువుల అమ్మకాలు చేపట్టినట్లైతే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## బాల వీరహన్మాన్ మందిరంలో అన్నప్రసాద వితరణ

**కౌడిపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ఎంతో మహిమ కల్గిన శ్రీ బాల వీరహన్మాన్ మందిరంలో శనివారం పూరోహితులు దేశాయిపేట మెట్టు రాములుశర్మ ఆంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, హన్మాన్ చాలీసా పారాయణం చేశారు. దాతల సహాయంతో ఆలయంలో అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామంలో నుండియే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుండి వేసవి వేడిమిని సైతం లెక్కచేయకుండా ఆలయంకు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానంలో మండల పరిధికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడు గురుకుల పాఠశాల, కళాశాలలో కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

**కొల్చారం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 23వ తేదీన (ఆదివారం) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ సత్య కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు 680 మందికి పరీక్ష నిర్వహిస్తున్న తెలిపారు. పరీక్ష ప్యాడ్, హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు.